
సాక్షి ఒడిశా

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 2,93,228
బంగారం	100 మిల్లీ గ్రాములు
వెండి	92 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ

ఉత్తమ ఒడియా చిత్రం 'ప్రతీక్ష'



తండ్రీ కొడుకుల బంధం ప్రధాన కథాంశంగా చిత్రీకరించిన 'ప్రతీక్ష' సినిమా, ఒడియా ఉత్తమ చలన చిత్రంగా 2023 సంవత్సరానికి సంబంధించి జాతీయ అవార్డును గెలుచుకుంది. -IIలో



మహనీయుల త్యాగాలు జాతి మరువదు

స్వాతంత్య్ర పోరాటంలో ప్రాణ త్యాగాలు చేసిన మహనీయులను జాతి మరవదని మంత్రి జగన్నాథ్ సరక అన్నారు. -IIలో

న్యూస్‌రీల్

చిన్నారులకు 'చంద్రయాన్' నామకరణం

భువనేశ్వర్: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా పలువురు జంటలు ఆ సమయంలో పుట్టిన తమ పిల్లలకు చంద్రయాన్‌గా నామకరణం చేశారు. కేంద్రాపడా ప్రాంతంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రాంతానికి చెందిన నలుగురు జంటలు పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేకుండా తమ బిడ్డలకు ఇలా పేర్లు పెట్టుకున్నారు. వీరిలో ముగ్గురు మగ మరియు ఒక ఆడ శిశువు ఉన్నారు. చంద్రునిపై చంద్రయాన్–3 సాఫీగా ల్యాండింగ్ అయిన కొద్ది క్షణాలకే అరిపాదా గ్రామానికి చెందిన రాణూ మల్లిక్ మగబిడ్డను ప్రసవించింది. మగ బిడ్డ జననం, మరోవైపు అత్యద్భుత చంద్రయాన్–3 మిషన్ విజయవంతం ఆనంద ఘడియల్లో తమ కుమారుడికి 'చంద్రయాన్' అని పేరు పెట్టారు. ఇదే జిల్లాకు చెందిన నీలకంఠపూర్ నివాసి జోష్న్యా రాణి బొలా మరియు ఏంజెలీ గ్రామానికి చెందిన బెబినా సెఠి కూడా తమ నవజాత మగ బిడ్డలకు చంద్రయాన్ అని పేరు పెట్టగా, తొలొచువా గ్రామానికి చెందిన దుర్గా మండల్ ఆడ శిశువుని ప్రసవించింది. ఆమె కూడ తన బిడ్డకు చంద్రయాన్ అని నామకరణం చేసింది.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- మంటల్లో చిక్కుకున్న ప్రైవేటు బస్సు



మంటల్లో దగ్ధమవుతున్న బస్సు

జయపురం: స్థానిక 26వ జాతీయ రహదారి బొరిగుమ్మ–నవరంగపూర్ మధ్య ఒక ప్రైవేటు బస్సు అగ్ని ప్రమాదానికి గురై దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. గుప్త ప్రైవేటు బస్సు హైదరాబాద్ నుంచి జయపురం, బొరిగుమ్మ మీదుగా చినాపల్లికి ప్రయాణికులతో వెళ్తోంది. 26వ జాతీయ రహదారి బొరిగుమ్మలో బస్సు టైర్‌కు పంక్చర్ అయ్యింది. దీంతో బస్సులో ఉన్న 40 మంది ప్రయాణికులు కిందకు దిగారు. అదే సమయంలో బస్సులో మంటలు పుట్టి అతివేగంగా బస్సు అంతా వ్యాపించింది. స్థానికులు వెంటనే అగ్నిమాపక విభాగానికి తెలియజేయగా, వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే బస్సు బూడిదైంది. ప్రయాణికులను ఒక ప్రత్యేక బస్సులో చినాపల్లికి పంపారు. అయితే షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. బస్సులో ఉన్నటువంటి విలువైన వస్తువులు కాలిపోయినట్లు ప్రయాణికులు వాపోయారు.

వివాహిత ఆత్మహత్య



ఉరికి వేలాడుతున్న వర్షా మృతదేహం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పుటాసింగి పోలీసుస్టేషన్ పరిధి గుంతులి గ్రామంలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గుంతిలి గ్రామానికి చెందిన రఘునాథ్ పాత్రోతో రెండు నెలల క్రితం గజపతి జిల్లాలోని సెరంగా పోలీసుస్టేషన్ పరిధి గయిబా గ్రామానికి చెందిన మగుణి మహంతి కూతురు వర్షారాణితో వివాహం జరిగింది. అయితే గత నెల నుంచే వర్షారాణికి అత్తవారి ఇంటి నుంచి వరకట్నం వేధింపులు మొదలయ్యాయి. ఇదే విషయమై ఆమె తన కన్నవారింటికి పలుమార్లు తెలియజేసింది. ఈ నేపథ్యంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పుకు చీర సాయంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న వర్షా కన్నవారు పుటాసింగి పోలీసుస్టేషన్‌లో భర్త, అత్తామామలపై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భద్రాచలం నుంచి కాలినడకన వస్తున్న దామోదర్

గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు ఇంటిల్లిపాది కడుపు నింపేందుకు ఉపకరించడం లేదు. ఉన్న ఊరులో చేతినిండా సంపాదన లేక కన్నవారిని, కట్టుకున్నవారిని వదిలి వెళ్తున్న వలసజీవులు అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. బతుకుజీవుడా అంటూ బయల్దేరుతున్న వలస పక్షులకు అడుగడుగునా అవమానాలు, అర్ధాకలి, ఆదిపత్యపు పోకడలు ఎదురవుతూనే ఉన్నాయి. కొందరు యాజమాన్యాల ఇబ్బందులకు గురవుతుండగా, మరికొందరిని పనికి తీసుకెళ్లిన వ్యక్తులే మోసగించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో చేసేదేమీ లేక కాలినడకన కన్న ఊరు బాటపడుతున్న బాధ్యులెందరో. కొరాపుట్ జిల్లా లమతాపుట్ సమితి సొగర గ్రామానికి చెందిన దామోదర ఖిలో తాను పనిచేసే చోట వేధింపులకు తాళలేక, డబ్బులేక స్వగ్రామం చేరుకునేందుకు కేవలం నీటిని తాగుతూ 350 కిలోమీటర్లు నడిచిన వెళ్లిన ఘటన కన్నీటిని తెప్పిస్తోంది. వివరాల్లోకి వెళ్తే..

కన్నీళ్లకే కన్నీరొచ్చే..!

- దళారీ చేతిలో మోసపోయిన వలస జీవి
- ఇంటికి వెళ్లేందుకు చేతిలో చిల్లిగవ్వ లేని వైనం
- నీటినే తాగుతూ 350 కి.మీ నడక ప్రయాణం

జయపురం: నవరంగపూర్ జిల్లా ఇంద్రావతి ప్రాంతానికి చెందిన ఒక దళారీ కొరాపుట్ జిల్లా లమతాపుట్ సమితి సొగర గ్రామానికి చెందిన దామోదర ఖిలోకు అధిక జీతానికి పని ఇప్పిస్తానని నమ్మబలికి తెలంగాణ రాష్ట్రం భద్రాచలం తీసుకెళ్లాడు. అక్కడ అతను ఒక ఒక రొయ్యల ఫ్యాక్టరీలో పనికి చేర్చాడు. అయితే ఆ ఫ్యాక్టరీలో దాదాపు 4 నెలల 15 రోజులు పనిచేసినా సంబంధిత ఫ్యాక్టరీ యజమాని ఖిలోకు ఎటువంటి జీతం చెల్లించలేదు. దీంతో తనకు జీతం ఇమ్మని ఖిలో యజమానిని అడుగగా అతడిని తీసుకొచ్చిన దళారీ డబ్బంతా తీసుకొని వెళ్లిపోయాడని స్పష్టం చేశాడు. అది విన్నటువంటి దామోధర ఖిలో ఖిన్నుడై ఏమి చేయాలో తెలియక కష్టమైనా ఇంటికి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాడు.

కాలి నడకన 350 కి.మీ ప్రయాణం

ఇంటికి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నా చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఖిలో ముందుగా ఆందోళన చెందాడు. అయితే భద్రాచలం విడిచి పోవాలన్న ధృఢ నిశ్చయంతో చేతి సంచితో కాలినడకన బయల్దేరాడు. నీటితో కడుపు నింపుకుంటూ దాదాపు 350 కి.మీ నడిచాడు. దీనిలో భాగంగా బొయిపరిగుడ సమీపంలోని కురులుగడ నదీ ఒడ్డున విశ్రాంత సెడ్‌లో సొమ్మసిల్లి ఉన్నాడు. అతడిని చూసిన ఆ ప్రాంత యువకులు సేద తీర్చి విషయాలు అడగగా, తన దయనీయ పరిస్థితిని తెలియజేశాడు. వెంటనే అతడికి కడుపు నిండా అన్నంపెట్టి కుటుంబ సభ్యులకు పరిస్థితిని వీడియో కాల్ ద్వారా తెలియజేశారు. వీడియోలో దామోదర ఖిలోను చూసిన కుటుంబ సభ్యులు ఆనందంతో కన్నీరు పెట్టుకున్నారు. కొన్ని నెలలుగా దామోదర జాడ తెలియక అతడు మరణించాడని భావించిన కుటుంబ సభ్యులు, మిత్రులు ఇంటికి రమ్మని చెప్పి కొంత డబ్బులు పంపించారు. దీంతో అతడిని యువకులు బొయిపరిగుడ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి అప్పగించారు. వెంటనే పోలీసులు పూర్తి వివరాలు తెలుసుకొని అతడి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఇంటికి పంపించేందుకు ఏర్పాట్లు చేశారు.



కురులుగడ నదీ ఒడ్డున విశ్రాంతి షెడ్‌వద్ద కూర్చున్న ఖిలో

సీఎం నివాసం ఎదురుగా..

ఆత్మహత్యాయత్నం

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నివాసం ఎదురుగా ఒక కుటుంబ సభ్యులు ఆత్మహత్యకు విఫలయత్నం చేశారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన 6 మంది సభ్యులుగా గుర్తించారు. సకాలంలో పోలీసులు చొరవ కల్పించుకుని వీరి ప్రయత్నం అడ్డుకుని సురక్షితంగా అదుపులోకి తీసుకున్నారు. వీరందరినీ స్థానిక ఎయిర్ ఫీల్డు ఠాణాకు తరలించి ప్రశ్నించారు. ఒక హత్య కేసులో పోలీసుల నిర్లక్ష్యానికి నిరసనగా కుటుంబీకులంతా కలిసి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దృష్టిని ఆకట్టుకునేందుకు ఇలా చేసినట్లు తెలిపారు. ఈ ఘటనతో నిత్యం రద్దీగా ఉండే స్థానిక పలాసపల్లి మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

బాధితుల కథనం మేరకు...

స్థానిక చంద్రశేఖర్‌పూర్ ప్రాంతంలో దైత్యరాజ్ నాయక్‌ను 2022 సంవత్సరంలో కొంతమంది హత్య చేశారు. అతనికి మత్తు పదార్థాలతో విషం ఇచ్చి, ఆపై యాసిడ్ ప్రయోగించి మృతదేహాన్ని కాల్చడానికి ప్రయత్నించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. 2022 సంవత్సరం జూన్ నెలలో చంద్రశేఖర్‌పూర్ పోలీసు ఠాణా పరిధి పండా పార్క్ బీదల వాడ సమీపం కాలువలో గోనె సంచిలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి సద్దుమణిగారు. పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై కుటుంబ సభ్యులు పదే పదే నిరసనలు తెలిపిన నేపథ్యంలో హత్య కేసుకు సంబంధించి అశోక్ జెనా అనే వ్యక్తిని ఆగస్టు 15వ తేదీన అరెస్టు చేశారు. అనంతరం ఇతర నిందితులు తమ కుటుంబాన్ని బెదిరిస్తున్నారని, తాము కూడా ఇలాంటి పరిణామం చవిచూడాల్సి వస్తుందని తరచూ భయపెడుతున్నారని పోలీసులకు మొర పెట్టుకున్నా పెడచెవిన పెడుతున్నారని బాధిత వర్గం వాపోతుంది. ఈ హత్య కేసులో నిందితులు అక్రమ మాదక ద్రవ్యాల వ్యాపారానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. బాధితుల వాంగ్మూలం మేరకు నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని పోలీసులు హామీ ఇచ్చి బుజ్జగించారు.



ఆత్మహత్యకు యత్నిస్తున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రజ్ఞానందకు అభినందనలు

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ ఇండియన్ గ్రాండ్ మాస్టర్‌ను అభినందించారు. ఫిడే వరల్డ్ కప్–23లో రన్నరప్ టైటిల్ సాధన ప్రయత్నంలో కొనసాగించిన ప్రయాణంలో వ్యూహాత్మక ప్రజ్ఞ మరియు సంకల్పం ప్రజ్ఞానంద శ్రేష్ఠతకు కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పాయి' అని గవర్నర్ అభినందన సందేశంలో పేర్కొన్నారు. అదేవిధంగా సీఎం నవీన్ పట్నాయక్ సైతం అభినందించారు. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సెన్‌తో ఫిడే అభ్యర్థుల టోర్నమెంట్‌కు అతిచిన్న వయసులో అర్హత సాధించి, రజత పతకాన్ని గెలుచుకోవడం గొప్ప విషయమన్నారు. ఈ రంగంలో మరింత రాణిస్తూ దేశానికి కీర్తిని తీసుకురావాలని ఆకాంక్షించారు.



ఆర్.ప్రజ్ఞానంద

పాముకాటుతో వ్యక్తి మృతి

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి కుంభారిగుడ వద్ద పాముకాటుతో ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొద్దిరోజులుగా కల్యాణ సింగుపూర్ ప్రాంతంలో వాటర్ షెడ్ ఆధ్వర్యంలో పైపు నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ పనుల కోసం వెళ్తున్న కొంతమంది కార్మికులు కుంభారిగుడ వద్ద తాత్కాలికంగా షెడ్డు వేసుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఎప్పటిలాగే భోజనాలు చేసిన అనంతరం తోటి కార్మికులతో కలిసి పూరి జిల్లా సత్యవాది సమితిలోని బగులుపూర్ గ్రామానికి చెందిన దొడొ స్వాయి(58) పడుకున్నాడు. అనంతరం అర్ధరాత్రి మూత్ర విసర్జన కోసం బయటకు వెళ్లాడు. అదే సమయంలో ఒక పాము అతడిని కాటు వేసింది. వెంటనే తన తోటి కార్మికులకు విషయం చెప్పడంతో వైద్యం కోసం సమీపంలోని పీహెచ్‌సీకి తరలించారు. చికిత్స చేసిన వైద్యుడు సౌభాగ్యకుమార్ అప్పటికే దొడొ మృతి చెందాడని ధ్రువీకరించారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దొడొ మృతదేహం

65 లీటర్ల నాటుసారా పట్టివేత

- ఇద్దరు అరెస్టు



నాటుసారాతో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఒరికిల్ పోలీసులు గురువారం మధ్యాహ్నం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో తర్లకోట గ్రామానికి చెందిన కేశ మాడ్కమి(45) ఎంవీ 35 గ్రామంలో నాటుసారా కొని గ్రామానికి తీసుకొస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 35 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకు న్నారు. అలాగే అదే గ్రామంలో ఇంటి వద్దనే సారా అమ్ముతున్న పోడియా బర్సే (35) అనే వ్యక్తిని సైతం అరెస్టు చేసి, 30 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఏఎస్‌ఐ విభస్ భూషన్ సుతార్ తెలియజేశారు.

డీఎఫ్‌వో ఆస్తులపై విజి'లెన్స్'



సోదాలు చేస్తున్న అధికారులు



డీఎఫ్‌వో బిజయ్ కుమార్ పొరిడ

రాయగడ: రాయగడ డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో) బిజయ్ కుమార్ పొరిడ ఆస్తులపై విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్న ఆరోపణలతో ఈ మేరకు దాడులు నిర్వహిస్తున్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలియజేశారు. విజిలెన్స్ డీఎస్పీ సంధ్య రాణి సాహు నేతృత్వంలో పరిడ నివసిస్తున్న గాంధీనగర్ కాలనీలోని నివాసంపై దాడులు నిర్వహించారు. అలాగే కటక్, జాజ్‌పూర్, ఖుర్దా జిల్లాల్లోని ఆయన ఆస్తులపై ఏకకాలంలో ఎనిమిది ప్రాంతాల్లో దాడులు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ దాడుల్లో 8 మంది డీఎస్పీలు, ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిసింది. కాగా రాయగడలో దాడులు చేపట్టిన అధికారులు రూ.1.24 లక్షల నగదు, ఎల్‌ఐసీ ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంబంధించిన దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా భువనేశ్వర్‌లో రూ.1.8 కోట్లు విలువ చేసే మూడు అంతస్తుల భవనం, మరికొన్ని స్థలాలకు సంబంధించిన విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

500 కిలోల గంజాయి సీజ్

- నలుగురు నిందితులు అరెస్టు



బాపూజీనగర్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు



అస్కాలో నిందితులు, గంజాయిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: బరంపురం పోలీసు జిల్లా పరిధి 16వ నంబర్ జాతీయ రహదారి బాపూజీ నగర్ 10వ లైన్‌లో ఒక ఇంటిపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన గంజాయి సీజ్ చేశారు. ఎక్సైజ్ కమిషనర్ రామచంద్ర మహంతి తెలిపిన వివరాల మేరకు.. బాపూజీ నగర్ 10వ లైన్‌లోని ఒక ఇంటిలో అక్రమంగా గంజాయి నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 290 కిలోల గంజాయిని సీజ్ చేసి, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అదేవిధంగా జిల్లాలోని పట్టపూర్ పోలీసుస్టేషన్ పరిధి దిగపండి బ్లాక్ రహదారిలో 160 కిలోల గంజాయి సీజ్ చేసి ఒకరిని, అలాగే అస్కా పోలీసులు మరో 50 కిలోల గంజాం సీజ్ చేసి మరో నిందితుడిని అరెస్టు చేశారు.



పట్టపూర్‌లో గంజాయి బస్తాలతో నిందితుడు

భారీగా కలప స్వాధీనం

- ఒకరు అరెస్టు
- పరారీలో ఇద్దరు వ్యక్తులు



అరెస్టైన సంతోష్ సాగరియా

జయపురం: భారీగా కలప అక్రమ రవాణా చేస్తుండగా ఒకరు పట్టుబడినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి గురువారం తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం రాత్రి బాగ్రగుడ సమీపంలో వాహనాలను ఎస్‌ఐ గౌరంగ చరణ దాస్, ఏఎస్‌ఐ ప్రియదర్శి గొమాంగొ, పంకజినీ శబర, అటవీ విభాగ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో అర్ధరాత్రి ముగ్గురు యువకులు మూడు ద్విచక్ర వాహనాలపై కలపను తీసుకెళ్తున్నారు. వారిని పోలీసులు చూడడంతో కలప, ద్విచక్ర వాహనాలను వదిలి సమీపంలోని పొలాల్లోకి పారిపోయారు. దీంతో పోలీసులు వారిని వెంబడించగా ఒకవ్యక్తి పట్టుబడ్డాడు. పట్టుబడిన వ్యక్తి చిలిగుడకు చెందిన సంతోష్ సాగరియ(20)గా నిర్ధారించారు. అతడి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, మొత్తం 54 గుగ్గిలం కలప చెక్కలను సీజ్ చేశారు. కలపను కుంద్ర నుంచి పంపుణీలో ఒక వ్యక్తికి ఇచ్చేందుకు తీసుకెళ్తున్నట్లు పట్టుబడిన వ్యక్తి తెలియజేశాడు. దీంతో కేసు నమోదు చేసి ఎస్‌ఐ శంకర పండ దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న గుగ్గిలం దుంగలు, ద్విచక్ర వాహనాలు

మిన్నంటిన రోదనలు

రాష్ట్రవ్యాప్తంగా చెరువుల్లో పడి పలువురు మృతి చెందిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వర్షాకాలం కావడంతో చెరువులు, నదుల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. ఈ సమయాల్లో స్నానాలు, ఇతర అవసరాలకు చెరువుల వద్దకు వెళ్తున్నవారు కాలుజారి పడుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అందువలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.

- చెరువుల్లో పడి పలువురు మృతి



వృద్ధుడి మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు



మంజుల మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితి గురండి పోలీసుస్టేషన్ పరిధి గోలగాం చెరువులో గురువారం సాయంత్రం ఒక వ్యక్తి స్నానానికి వెళ్లి మునిగి మృత్యువాత పడ్డాడు. గ్రామస్తులు ఆయన మృతదేహాన్ని కనుగొని గురండి పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. మృతి చెందిన వ్యక్తి తిరుపతి రవుతో (52)గా గుర్తించారు. ఆయన కుటుంబ సభ్యులు హైదరాబాదులో ఉంటున్నారు. మృతుడు తిరుపతి రవుతో గ్రామంలో ఎలక్ట్రిక్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అయితే చెరువులో కాలుజారి పడిపోయాడో, లేక ఎవరైనా హత్య చేసి ఉంటారో అనే అనుమానంతో గురండి పోలీసు అధికారి రవీంద్ర పాత్రో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పర్లాకిమిడి ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపారు.

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి కమ్‌బేడ పంచాయతీ ఎంవీ 29 గ్రామానికి చెందిన అమాల్ మారమి(70) మృతదేహం చెరువులో లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. ప్రతిరోజూ మాదిరిగానే అమాల్ మారమి గ్రామానికి సమీపంలోని చెరువు వద్దకు బుధవారం స్నానం చేయడానికి వెళ్లాడు. అయితే ఆయన చాలా సమయం రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారుపడి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియలేదు. అయితే గురువారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులకు చెరువులో మృతదేహం తేలుతూ కనిపించింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులకు మరియు పోలీసులకు సమచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే చెరువులో నీరు ఎక్కువగా ఉండడంతో కాలుజారి పడిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ కుడింగిగుడ బ్రిడ్జి వద్ద ఇసుక లోడ్ చేస్తుండగా కాలుజారి నదిలో పడడంతో ఒక మహిళ చెందింది. మరొకరు కొద్దిదూరం నదిలో కొట్టుకుపోగా అక్కడ ఉన్నవారు కాపాడారు. గురువారం చోటు చేసుకున్న ఘటనలో మృతి చెందిన మహిళ గోరఖ్‌పూర్ పంచాయతీలోని గుమురాపుట్ గ్రామానికి చెందిన రొయి మాఝి కూతురు మంజులా మాఝి (31) కాగా, ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన మహిళ సుకాయి మాఝి (27)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. ఎప్పటిలాగే కుడింగిగుడ బ్రిడ్జి కింద నదిలో ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్ చేసేందుకు మంజులా, సుకాయిలతో పాటు మరికొందరు మహిళలు వెళ్లారు. ఇసుక లోడింగ్ చేస్తున్న సమయంలో మంజులా, సుకాయిలు కాలుజారి నదిలో పడిపోయారు. నదీ ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ప్రమాదంలో మంజుల మృతి చెందింది. టికిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఆలయంలో చోరీ



ఆలయం వద్ద విచారిస్తున్న పోలీసులు

బరంపురం: స్థానిక లంజిపల్లి గ్రామంలో ఉన్న చండీ ఆలయంలో అర్ధరాత్రి చోరి జరిగిన ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. గురువారం ఉదయం ఆలయం తలుపులు తెరిచేందుకు వచ్చిన పూజారి జరిగిన చోరీపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్పీ సార్వణ్ వివేక్ తెలిపిన వివరాల మేరకు.. బుధవారం అర్ధరాత్రి బీఎన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధి లంజిపల్లి గ్రామ చండీ ఆలయంలో అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడి హుండీ బద్దలుగొట్టి సుమారు రూ.25 వేలకు పైగా నగదు, మరో ఇత్తడి హుండీ దోచుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన వాసు

విజయనగరం క్రైమ్: నెల్లిమర్ల మండలం అలుగోలు గ్రామానికి చెందిన పల్లి వాసు (30) బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పల్లి వాసు కొంతకాలం వరకూ ఓఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పరీక్షలు రాసేవాడు. అయితే ఉద్యోగం చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవడం కష్టంగా ఉందని తొమ్మిది నెలల క్రితం ఉద్యోగాన్ని వదిలి విజయనగరంలోని పద్మావతినగర్‌లో నివాసం ఉంటున్న అన్నయ్య సంతోష్ వద్దకు వచ్చి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. చిన్నప్పుడే తండ్రిని కోల్పోయానని, అన్నయ్య సంతోష్ ఉద్యోగం లేక పుస్తకాల వ్యాపారం చేయడం వల్ల వివాహం కాలేదని, తాను కూడా మంచి ఉద్యోగం సంపాదించలేకపోతున్నానన్న మనస్తాపంతో బుధవారం రాత్రి ఇంట్లోని పూజగదిలో ఉరివేసుకున్నాడు. పుస్తకాల వ్యాపారం పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన సంతోష్ తమ్ముడు ఇంకా రాలేదని భావించి ఫోన్ చేశాడు. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఇంట్లోనే ఉన్నాడేమోనని భావించి వెతకగా పూజ గది తలుపు వేసి ఉండడంతో అనుమానం వచ్చి తలుపులు విరగ్గొట్టి చూసేసరికి ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే అలుగోలులో ఉంటున్న తల్లిలక్ష్మికి విషయం చెప్పి, వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ ఎస్సై రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

భోగాపురం: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. గురువారం మధ్యాహ్నం భోగాపురం మండలంలోని ముంజేరు గ్రామ సమీపంలో జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. భోగాపురం గ్రామానికి చెందిన కరుణాకరన్ తన సొంత పనుల నిమిత్తం బైక్‌పై ముక్కాం బయల్దేరాడు. ముంజేరు గ్రామ సమీపంలో ఉన్న సచివాలయం వద్దకు చేరుకునేసరికి అంతలో ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీకొట్టింది. దీంతో రెండు బైక్‌లపై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎఎస్సై తవుడు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను విజయనగరం, తగరపువలస ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చీపురుపల్లి: స్థానిక రైల్వే స్టేషన్‌లో రైల్వే ట్రాకుపై గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఉదయం రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడని, అతని వయసు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుంద ని, పచ్చ రంగు షర్ట్ ,ఖాకీ రంగుప్యాంటు ధరించి ఉన్నాడని, జేబులో టీప్ ఉందని తెలిపారు. మృతుడి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 70132 73731 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బస్సు ఢీకొని మహిళకు గాయాలు



చికిత్స పొందుతున్న గౌరమ్మ

పార్వతీపురం: బస్సును రివర్స్ చేస్తున్నప్పుడు వెనుకనుంచి ఢీ కొట్టడంతో గురువారం ఓ మహిళకు గాయాలయ్యాయి. గరుగుబిల్లి మండలం వల్లరగుడబ గ్రామానికి చెందిన ఊడుగు గౌరమ్మ అనారోగ్యం కారణంగా వైద్య పరీక్షల కోసం పార్వతీపురం బయలుదేరి బస్టాండ్‌వద్ద నిరీక్షిస్తున్న సమయంలో పార్వతీపురం నుంచి వల్లరగుడబ వచ్చిన ఆర్టీసీ బస్సును వల్లరగుడబ బస్‌స్టాండ్‌వద్ద రివర్స్ చేస్తున్న సమయంలో గౌరమ్మను ఢీకొంది. ఈసంఘటనలో గౌరమ్మ కింద పడిపోగా బస్సు వెనుక టైరు కాలిపైనుంచి వెళ్లింది. దీంతో కాలికి బలమైన గాయమైన కారణంగా స్థానికులు చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.



సాయిధ స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు



అమరులకు టురి నదిలో పిండ తర్పణం చేస్తున్న దృశ్యం



పపడాహండి రోడ్డులో అమర జ్యోతితో ర్యాలీ చేస్తున్న దృశ్యం

మహనీయుల త్యాగాలు జాతి మరువదు

- మంత్రి జగన్నాథ సరక



గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

కొరాపుట్: స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణ త్యాగాలు చేసిన మహనీయులను జాతి మరవదని మంత్రి జగన్నాథ సరక అన్నారు. నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి టురి నది ఒడ్డున స్వాతంత్ర్య పోరాట యోధుల సాయుధ స్థూపం వద్ద సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1942 ఆగస్టు 24వ తేదీన ఇక్కడ జరిగిన కాల్పుల్లో పదుల సంఖ్యలో ఉద్యమకారులు బలి దానాలు చేశారని గుర్తు చేశారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు స్వేచ్ఛా వాయువు పీలుస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో శాస్త్రి భవన్ నుంచి అమర జ్యోతిని స్వాతంత్ర్య పోరాట యోధుల కుటుంబ సభ్యుల సంఘం ప్రతినిధి మున్నా త్రిపాఠి పట్టుకొని ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ పపడాహండి వరకు కొనసాగింది. అనంతరం అక్కడ మంత్రి



స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం



నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు

సరక, నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి, కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా అందుకున్నారు. తదుపరి స్థూపం వరకు ర్యాలీ జరిగి అక్కడ అమరవీరులకు నివాళులర్పించారు. సర్వమత పెద్దలు వచ్చి మత ప్రార్ధనలు చేపట్టారు. టురి నదిలో దివంగతులకు పిండ ప్రధానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వాతంత్ర్య మండలి సలహాదారుడు ప్రదీప్ మజ్జి, ఎమ్మెల్యేలు సదాశివ ప్రధాని(నబరంగ్‌పూర్), మనోహర్ రంధారి(డాబుగాం), ప్రకాష్ చంద్ర మజ్జి(జొరిగాం), ఎస్పీ ఎస్.సుశ్రీ, జెడ్పీ అధ్యక్షుడు మెతిరాం నాయక్, మా ఘరో మహిళా హక్కుల సంస్థ నాయకురాలు కదంబనీ త్రిపాఠీ, మాజీ ఎమ్మెల్యే భుజబల్ మజ్జి, మాజీ ఎంపీ భగవాన్ మజ్జి, మాజీ జెడ్పీ అధ్యక్షురాలు మంజులా మజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఒడియా చిత్రం 'ప్రతీక్ష'



ప్రతీక్ష చలన చిత్రంలో ఒక దృశ్యం

భువనేశ్వర్: తండ్రీ కొడుకుల బంధం ప్రధాన కథాంశంగా చిత్రీకరించిన 'ప్రతీక్ష' సినిమా, ఒడియా ఉత్తమ చలన చిత్రంగా 2023 సంవత్సరానికి సంబంధించి జాతీయ అవార్డును గెలుచుకుంది. 69వ జాతీయ చలన చిత్ర అవార్డుల విజేతలను గురువారం ప్రకటించారు.

ప్రధాన కథాంశం

మధ్య తరగతి కుటుంబానికి చెందిన సంజయ్ అనే అబ్బాయి ప్రభుత్వ ఉద్యోగం కోసం వెదుకులాటలో సాగే కథే ఈ చిత్రం. అతని తండ్రి బిపిన్ ప్రభుత్వ ఉద్యోగి. ఆయనకు ప్రాణాంతకమైన అనారోగ్యం. అప్పుల ఊబిలో కూరుకుపోయిన కుటుంబ పోషణ తలకుమించిన భారంగా పరిణమిస్తుంది. సంజయ్‌కు ఉద్యోగం లభిస్తే కుటుంబ కష్టాలు గట్టెక్కుతాయనే తపనతో ఉద్యోగ వేట ఆరంభిస్తాడు. ఉద్యోగం వెదుకులాటలో వేశారిపోయిన క్షణంలో ప్రభుత్వ ఉద్యోగులకు అకాల మరణ సంభవిస్తే, సిబ్బంది కుటుంబీకుల్లో ఒకరికి కారుణ్య కోటా కింద ఉద్యోగం లభిస్తుందనే సమాచారం కొడుకు సంజయ్‌కు అందుతుంది. ఆ క్షణం నుంచి తండ్రి మరణం కోసం కొడుకు నిరీక్షించడం ప్రతీక్ష చలన చిత్ర ప్రధాన కథాంశం.

చిన్న కథకు ప్రసంశలు మిన్న

సరళా పురస్కార గ్రహీత రచయిత్రి గౌరహరి దాస్ రాసిన చిన్న కథ మరియు కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ప్రతీక్ష చిత్ర నిర్మాణం జరిగింది. ఈ చిత్రానికి ప్రముఖ ఒడియా చలన చిత్ర నిర్మాత మరియు దర్శకురాలు దివంగత అమియా పట్నాయక్ కుమారుడు అనుపమ్ పట్నాయక్ దర్శకత్వం వహించారు. అమియా పట్నాయక్ ప్రొడక్షన్స్ పతాకంపై భువనేశ్వర్‌లోని పలు సుపరిచిత ప్రాంతాల్లో ఈ చలన చిత్రం చిత్రీకరించారు. ఈ సినిమాలో దీపాన్విత్ దాస్‌మహపాత్రో, చౌదరి జయప్రకాష్ దాస్, బొర్షా పట్నాయక్, శ్రీలా త్రిపాఠి, రూపాంబికా నాయక్, సుశీల్ మిశ్రా, ఒబొకాష్ మిశ్రా మరియు సిద్ధాంత్ మహపాత్ర ప్రత్యేక తారాగణంగా నటించారు.

తొలిరోజు నుంచి హౌజ్‌ఫుల్

గతేడాది డిసెంబర్ 2న విడుదలైన ఈ చిత్రం అడ్వాన్స్ టిక్కెట్ బుకింగ్‌తో తొలిరోజు నుంచి థియేటర్లు హౌస్‌ఫుల్‌తో కిక్కిరిసిపోయాయి. అంతకుముందు 2022 సంవత్సరం నవంబర్ నెలలో వాషింగ్‌టన్ డీసీ యూఎస్ఏలో జరిగిన 11వ వార్షిక డీసీ దక్షిణ ఆసియా ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రతీక్ష ఉత్తమ కథా పురస్కారాన్ని అందుకుంది. గోవాలో జరిగిన 53వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ)-2022 పురస్కరించుకుని నటుడు, దర్శకుడు అనుపమ్ ఖేర్ ఈ చిత్రాన్ని హిందీలో రీమేక్ చేస్తున్నట్లు ప్రకటించారు. డబ్లిన్ సైంటాలజీ కమ్యూనిటీ సెంటర్‌లో ఆంగ్ల ఉప శీర్షికలతో నిర్వహించిన ప్రతీక్ష చిత్రం ప్రదర్శనకు దాదాపు 75 మంది ఒడియాలు మరియు ఏడు నుంచి ఎనిమిది మంది ఐరిష్ అతిథులు హాజరై ప్రశంసించారు.

పోలీసు కాల్పుల్లో గాయపడిన పిను



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పినాకి బొరాల్

భువనేశ్వర్: పేరుమోసిన నేరగాడు పినాకి బొరాల్ అలియాస్ పిను పోలీసుల ఎదురు కాల్పుల్లో గురువారం గాయపడ్డాడు. పూరీ లోక్‌నాథ్ ఆలయ సమీపంలోని శంకరేశ్వర్ అడవుల్లో ఈ ఘటన జరిగింది. నిందితుడి ఎడమ కాలికి గాయాలై కుప్పకూలడంతో పోలీసులకు చిక్కాడు. అదుపులోకి తీసుకున్న పోలీసులు సత్వర చికిత్స కోసం స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రి (డీహెచ్‌హెచ్)లో చేర్చారు. అతనికి వ్యతిరేకంగా హత్యాయత్నం వంటి ఘోరమైన ఆరోపణలతో 11కి పైగా కేసులు పెండింగులో ఉన్నాయి.


ఇంటలిజెన్స్ వర్గాల సమాచారంతో...

తుపాకీ ఇతరేతర ఆయుధాలతో హార్డ్‌కోర్ నేరస్తుడు తన సహచరులతో సాయుధ దోపిడీలకు పూరీలోకి ప్రవేశిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో స్థానిక బసెలిసాహి తాణా పోలీసులు రంగంలోకి దిగారు. ఐఐసీ మానస్ బారిక్ ఆధ్వర్యంలో సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం అటవీ ప్రాంతంలో నిందితుడి కోసం ఎదురుచూసింది. ఈ నేపథ్యంలో చోటుచేసుకున్న ఎదురు కాల్పుల్లో నేరస్తుడి ఎడమ కాలికి గాయమైంది. అనంతరం చికిత్స కోసం పూరీకి తరలించారు. ఘటనా స్థలం నుంచి ఒక పిస్టల్, 2 రౌండ్ల తూటాలు, ఇతర పేలుడు సామగ్రిని పోలీసుల బృందం స్వాధీనం చేసుకుంది. ఎదురుకాల్పుల్లో బసెలీ తాణా సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ వ్యవహారంపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

మావో బ్యానర్ల కలకలం



రామనకుపులి కూడలిలో వెలిసిన బ్యానర్



మావోలు అతికించిన పోస్టర్

రాయగడ: జిల్లాలో మునిగుడ పోలీసుస్టేషన్ పరిధిలోని రామనకుపులి కూడలిలో మావో పోస్టర్లు, బ్యానర్లు కలకలం సృష్టించాయి. గురువారం ఉదయం నాటికి వెలసిన బ్యానర్లలో అధికార బీజేడీకి చెందిన రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక, బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుదీర్ కుమార్ దాస్, రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావులను హెచ్చరిస్తూ మావోలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పోలీసులు తప్పుడు కేసులను పెట్టి అమాయక ప్రజలను వేధిస్తుండడమే కాకుండా, కేసుల పేరిట స్టేషన్లలో తీవ్రంగా గాయపరుస్తున్నారన్నారు. వెంటనే అధికార బీజేడీ నాయకులు తప్పుడు కేసుల నుంచి విడుదల చేయించాలని, లేదంటే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బఘునా డివిజనల్ కమిటీ పేరిట వెలసిన బ్యానర్లలో ప్రకటించారు. విషయం తెలుసుకున్న మునిగుడ పోలీసులు రామనకుపులి ప్రాంతానికి వెళ్లి బ్యానరు, పోస్టర్లను స్వాధీనం చేసుకున్నారు.

27న విజయభావన సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీమిత్ర సమాఖ్య 524వ సాహిత్య సదస్సు ఈ నెల 27న ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'తెలుగు భాషకు గొడుగు గిడుగు' అనే అంశంపై ప్రముఖ సాహితీవేత్త విశాఖ సహృదయ సాహితీ సంస్థ అధ్యక్షుడు శేఖర మంత్రి ప్రభాకరరావు వక్తగా ప్రసంగిస్తారని పేర్కొన్నారు. విజయభావన ప్రత్యేక సలహాదారు డాక్టర్ భైరవభట్ల విజయాదిత్య సన్మానకర్తగా, ఎం ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.రాఘవరావు అధ్యక్షత వ్యవహరిస్తారన్నారు. సాహితీవేత్తలందరూ హాజరుకావాలని కోరారు.

31 నుంచి ఆదిభట్ల 159వ జయంతి మహోత్సవాలు

విజయనగరం టౌన్: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 159 జయంతి మహోత్సవాలు ఆగస్టు 31, సెప్టెంబరు ఒకటి తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆదిభట్ల నారాయణదాస ఆరాధనోత్సవ సంఘం అధ్యక్షులు పివి.నరసింహరాజు(బుచ్చిబాబు) గురువారం ప్రకటనలో తెలిపారు. టీటీడీ ఆధ్యాత్మిక భక్త మండలి వేదికగా కార్యక్రమాలు రూపొందించామన్నారు. 31న కానుకుర్తివారి వీధిలో ఉన్న దాసు గృహంలో పూజలు , వెన్‌లాక్‌పార్కులో దాసు విగ్రహానికి , సంగీత కళాశాలలో దాసు విగ్రహానికి పుష్పమాలాంకరణ,అనంతరం వేదిక వద్ద కథాగానాలు ఉంటాయన్నారు. ఒకటో తేదీన శుక్రవారం హరికథలు, సాయంత్రం నిర్వహించే కార్యక్రమంలో ముఖ్య అతిథి కోలగట్ల శ్రావణి చేతుల మీదుగా మచిలీపట్టణానికి చెందిన మడమల రాంబాబు భాగవతులకు ఆదిభట్ల పురస్కారం అందజేయనున్నామన్నారు. అభిమానులందరూ హాజరుకావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



గణేష్(ఫైల్)

సీతమ్మధార: పార్వతీపురం మన్యం జిల్లా, కొమరాడ మండలం, గంగరేగువలసకు చెందిన దాసరి గణేష్(25) విశాఖపట్నంలో బస్సు ఢీకొట్టడంతో మృతి చెందాడు. విశాఖపట్నంలోని ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. రామాటాకీస్ దరి ఇంక్రైడ్ ప్రైవేట్ సంస్థలో సేల్స్ ఆఫీసర్‌గా గణేష్ ఆరు నెలలుగా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి ఆఫీస్ పని మీద కొరియర్ చేసేందుకు రామాటాకీస్ నుంచి డైమండ్ పార్కు వద్దకు బైక్‌పై వెళ్తున్నాడు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని పాత తిలక్ షోరూం వద్దకు వచ్చే సరికి గురుద్వారా నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు గణేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌తోపాటు రోడ్డు మీద పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే 108లో కేజీహెచ్‌కు తీసుకెళ్లగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బంధువు ద్వారపురెడ్డి చూడ మణేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు రేపు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 27న నిర్వహించనున్నట్టు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వై.కుసుంబచ్చన్ గురువారం తెలిపారు. విజయనగరం పడాలపేటలో గల ఎపిక్ బ్యాడ్మింటన్ స్టేడియంలో అండర్-11,13,15 వయస్సు విభాగాల్లో బాల, బాలికలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఏపీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో మధ్యాహ్నభోజనం ఏర్పాటు చేస్తామన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 25వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్: 91337 73485, 79891 99534 నంబర్లను సంప్రదించాలన్నారు.

చదువుకున్న బడి బాగుకు ఒక నెల వేతనం వితరణ

- ప్రభుత్వ పాఠశాలకు రూ.70,576లు అందించిన ఉపాధ్యాయుడు
- అభినందించిన తోటి ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు



సరస్వతీదేవి సాక్షిగా నగదును సర్పంచ్‌కు, ఉపాధ్యాయులకు అందజేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు రమణ

మెరకముడిదాం: తనకు చిన్నతనంలో ఓనమాలు నేర్పించి, తన విద్యోన్నతికి పునాది వేసిన బుదరాయవలస జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి, అదే పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎంగా పనిచేస్తున్న మాడుగుల రమణ ఒకనెల వేతనం 70,576ను గురువారం వితరణగా అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, సర్పంచ్ సారిక తమ్మినాయుడుకు నగదు అందజేసి, మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలని కోరారు. తను చదువుకున్న పాఠశాలలో సౌకర్యాలకల్పనకు వితరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆయనను తోటి ఉపాధ్యాయులతో పాటు సర్పంచ్, గ్రామస్తులు అభినందించారు.

గిరిజన విద్యార్థుల్లో విద్యావికాసం



డిప్యూటీ సీఎం రాజన్నదొరతో కలిసి మాట్లాడుతున్న వై.వి.సుబ్బారెడ్డి

దత్తిరాజేరు: పార్వతీపురం(మన్యం)జిల్లా సాలూరు నియోజకవర్గంలో చినమేడపల్లి వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేయనున్న గిరిజన యూనివర్సిటీతో గిరిజన విద్యార్థుల్లో విద్యావికాసం కలగనుందని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యలతో కలిసి మెంటాడ మండలం చినమేడపల్లి వద్ద ఆవిష్కరించనున్న శిలాఫలకం పనులు, దత్తిరాజేరు మరడాం వద్ద సభా వేదికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు స్థల పరిశీలనలు చేయడమే తప్ప వర్సిటీని నిర్మించాలన్న ఆలోచన చేయలేదన్నారు. ముఖ్యమంత్రి కేంద్రంతో మాట్లాడి అన్ని వసతులు ఉన్న ప్రదేశాన్ని చూపించడంతో వర్సిటీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019లో ఏర్పడిన వెంటనే విజయనగరంలో తాత్కాలిక భవనాల్లో తరగతుల ప్రారంభానికి చర్యలు తీసుకుందన్నారు. 561 ఎకరాల్లో సుమారు రూ.840 కోట్ల వ్యయంతో వర్సిటీ నిర్మాణ పనులు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయండి

సాలూరు: సాలూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర కోరారు. సాలూరు నియోజకవర్గం మెంటాడ మండలంలోని చినమేడపల్లి సమీపంలో కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు శుక్రవారం ముఖ్యమంత్రితో పాటు కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ వస్తున్నారన్నారు. సమావేశానికి నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మున్సిపల్‌చైర్మన్లు, వైస్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, వివిధ కార్పొరేషన్లు, శాఖల చైర్మన్‌లు, డైరెక్టర్లు, సభ్యులు, సచివాలయ గృహసారథులు, సమన్వయకర్తలు, పార్టీశ్రేణులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

28న మీ వద్దకే పీఎఫ్

విజయనగరం టౌన్: పీఎఫ్ ఖాతాదారులు, పెన్షనర్లు, పీఎఫ్ సంస్థల యజమానులకు సంబంధించిన సమస్యలపై ఈ నెల 28న మీ వద్దకే పీఎఫ్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ అబ్దుల్ ఖాదర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విజయనగరంలోని రింగురోడ్డు సింహాద్రినగర్ , ఫ్లాట్ నంబర్ వన్‌లో ఉన్న ఈఎస్‌ఐ కార్పొరేషన్ కార్యాలయంలోను, పార్వతీపురం మన్యం జిల్లా మున్సిపల్ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. పీఎఫ్ సమస్యలు ఉన్న వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ సిమ్‌ను సద్వినియోగం చేసుకోండి

- డీజీఎం దాలినాయుడు



డి.దాలినాయుడు, డిప్యూటీ జనరల్ మేనేజర్, బీఎస్ఎన్ఎల్, విజయనగరం

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్ ఉచిత 4జి సిమ్‌ను వినియోగదారులు తీసుకోవాలని బీఎస్ఎన్ఎల్ డీజీఎం డి.దాలినాయుడు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఇప్పటికే కొంతమంది వినియోగదారులు వారి పాత 3జి సిమ్ ద్వారానే మొబైల్ సేవలు పొందుతున్నారన్నారు. 4జి సాంకేతికతను ప్రారంభించిన తర్వాత 3జి సేవలలో అంతరాయం వచ్చే అవకాశం ఉన్నందున, 3జి వినియోగదారులందరూ తప్పనిసరిగా ఉచితంగా అందజేసే 4జి సిమ్‌ను తీసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు జిరాక్స్ సమర్పించి కార్యాలయం పనివేళల్లో సంప్రదించి సిమ్ పొందవచ్చన్నారు. ప్రస్తుత సిమ్ 3జి లేదా 4జి లో ఉందా అనే విషయాన్ని తెలుసుకోవాలంటే వారి మొబైల్ నుంచి సిమ్ అని టైప్ చేసి 9441299999కు మెసెజ్ పంపి వెంటనే తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా సెప్టెంబరు 30లోపు కేవైసీ ద్వారా డిజిటలైజ్ చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని 3జి వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

నాయకత్వ లక్షణాలకు విద్యార్థి దశే కీలకం

- జేసీ ఎం.నవీన్



జేసీ నవీన్‌కి జ్ఞాపికను అందజేస్తున్న అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్ : యువత నాయకత్వ లక్షణాలు పొందడంలో విద్యార్థి దశే కీలకమని శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పేర్కొన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో గురువారం జరిగిన క్యాంపస్ కాప్స్ ఫేజ్-2 శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి జేసీ నవీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎస్పీ విద్యార్థుల కోసం జిల్లాలో క్యాంపస్ కాప్స్ లాంటి మంచి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, దీని ద్వారా విద్యార్థులకు చట్టాలు, నాయకత్వ లక్షణాలు, సైబర్ నేరాల నియంత్రణ వంటి వివిధ అంశాలపై మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారని తెలిపారు. శిక్షణ కాలంలో నేర్చుకున్న విషయాలను అందరితో పంచుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వీటిపై చైతన్యం కలిగించాలని సూచించారు. అనంతరం జేసీ నవీన్‌కు అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోటబొమ్మాళి: జాతీయ రహదారిపై కన్నేవలస పెట్రోల్ బంక్ వద్ద గురువారం రాత్రి లారీ ఓ వ్యక్తిని ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో సంతబొమ్మాళి మండలం ఉమిలాడకు చెందిన గుంట త్రినాథరావుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం త్రినాథరావు కన్నేవలస పెట్రోల్ బంకు వద్ద రోడ్డు దాటుతుండగా పలాస వైపు వెళ్తున్న లారీ అతడిని ఢీకొట్టి వెళ్లిపోయింది. వెంటనే స్థానికులు స్పందించి 108కు సమాచారం అందించడంతో ఆ వాహనంలో క్షతగాత్రుడిని కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి రిమ్స్‌కు పంపించారు.లారీ కోసం గాలించి పలాస-లక్ష్మీపురం టోల్‌గేట్ వద్ద డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

భార్యపై హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు

కంచిలి: భార్యను వేధించి, హత్యాయత్నానికి పాల్పడిన కేసులో భర్తకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ సోంపేట అసిస్టెంట్ కోర్టు జడ్జి జె. శ్రీనివాసరావు గురువారం తీర్పు చెప్పారని స్థానిక ఎస్‌ఐ ఎస్. బాలరాజు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. 2022 మే 27వ తేదీన ఇచ్ఛాపురం మండలం మండపల్ల గ్రామానికి చెందిన రాజేంద్ర బెహరా తన భార్య రేఖా బెహరాపై శాసనాంలో అర్ధరాత్రి 2 గంటల సమయంలో కత్తితో దాడికి తెగబడ్డాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ ఎస్. చిరంజీవి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. తర్వాత నిందితుడు బెయిల్ మీద బయటకు వచ్చాడు. తర్వాత కోర్టు ట్రయల్స్‌లో వాయిదాలకు కూడా హాజరు కాలేదు. దీంతో ముద్దాయికి కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేయడంతో ప్రస్తుత కంచిలి ఎస్‌ఐ ఎస్.బాలరాజు ముద్దాయి స్వగ్రామం ఇచ్ఛాపురం మండలం మండపల్లి వెళ్లి అరెస్టు చేసి, జూలై 28వ తేదీన కోర్టులో హాజరు పర్చారు. నేరం రుజువై పైన పేర్కొన్న విధంగా తీర్పు వెలువడింది.

తీరానికి కొట్టుకువచ్చిన మృతదేహం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పెదగనగళ్లవానిపేటగ్రామంలో గల సముద్ర తీరానికి గురువారం సాయంత్రం గుర్తు తెలియని పురుషుని మృతదేహం కొట్టుకొచ్చింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని రిమ్స్‌లో భద్రపరిచారు. మృతుడి వయసు దాదాపు 45 ఏళ్లు ఉంటుంది. మృతదేహం గురించి వివరాలు తెలిస్తే రూరల్ పోలీస్‌స్టేషన్ 63099 90845, 9490533820 నంబర్లను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

అప్పుల బాధ తాళలేక టీచర్ ఆత్మహత్య

టెక్కలి రూరల్: ఆన్‌లైన్ గేములకు బానిసై పోయి డబ్బులన్నీ అందులోనే నష్టపోయిన ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టెక్కలిలో చోటు చేసుకుంది. టెక్కలి ఏఎస్‌ఐ టి.నర్సింగరావు తెలిపిన వివరాలు ప్రకారం.. టెక్కలి మండలం తొలుసూరుపల్లి గ్రామానికి చెందిన హనుమంతు విజయానంద్(56) అనే ఉపాధ్యాయుడు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన టెక్కలి ఎంపీపీ స్కూల్‌లో ఉపాధ్యాయుడి గా పనిచేస్తున్నా రు. విజయానంద్ గత ఐదేళ్లుగా విపరీతంగా ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతున్నారని, దాదాపు రూ.60 లక్షల వరకు అప్పులు చేశారని భార్య రాధ పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఇటీవలే తన పొలం అమ్మి అప్పులు తీర్చారు. అయినా ఇంటిలో తెలియకుండా ఇంకో రూ.20 లక్షలు అప్పు చేశారు. దీంతో ఆయనకు వచ్చే జీతమంతా కారు, బైక్ లోన్‌లకే అయిపోతోంది. దీనికారణంగా ఇంటిలో గొడవలు జరుగుతుండేవి. ఇలాగే గొడవపడి బుధవారం ఇంటి నుంచి బయ టకు వెళ్లిపోయిన ఆయన గురువారం ఉదయం గ్రామ సమీపంలోని రామకృష్ణ మఠం వెనుక తోటలో శవమై కనిపించారు. పక్కనే మద్యం సీసాలో పురుగు మందు కలిపి తీసుకున్నట్లు ఆనవాళ్లు ఉన్నాయి. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీచర్ మృతితో గ్రామంలో విషాద ఛాయ లు అలుముకున్నాయి.

ప్రతిభకు ప్రోత్సాహకం

- ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
- వచ్చే నెల 15 వరకు గడువు
- ఎనిమిదో తరగతి విద్యార్థులు అర్హులు
- తొమ్మిది నుంచి ఇంటర్మీడియెట్ వరకు ప్రోత్సాహకాలు
- ఏటా రూ.12 వేలు చొప్పున సాయం
- డిసెంబర్ 3న రాత పరీక్ష



కంచిలి: ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. చురుకైన విద్యార్థులకు ఆర్థికంగా బాసటగా నిలిచేందుకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) అందజేస్తున్నారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిఏపీ డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ విభాగం ఇటీవల ఎన్‌ఎంఎంఎస్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

జిల్లాలో 250 మందికి ప్రయోజనం..

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12వేలను స్కాలర్‌షిప్ రూపంలో ప్రభుత్వం అందిస్తుంది. ఈ మొత్తం నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాల్లోకి జమవుతుంది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తి చేసే వరకూ ఈ ఉపకార వేతనం లభిస్తుంది. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుంది. జిల్లా నుంచి ఏటా ఈ పరీక్షకు వందలసంఖ్యలో విద్యార్థులు హాజరౌతున్నారు. ప్రతి ఏడాది 230 నుంచి 250 మంది అర్హత సాధిస్తున్నారు. వీరందరికీ నాలుగేళ్ల పాటు ఉపకార వేతనాలు అందుతున్నాయి.

ఈ అర్హతలు తప్పనిసరి..

- ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో చదివే విద్యార్థులు ఈ ప్రోత్సాహకాలకు అర్హులు.
- ఏడో తరగతిలో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలి.
- తుది ఎంపిక సమయం నాటికి 8వ తరగతిలో 55 శాతం మార్కులు పొందాలి. కుటుంబ వార్షికాదాయం ఏడాదికి రూ.3,50,000 మించకూడదు.

పరీక్ష విధానం..

అర్హులైన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో పరీక్ష నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్ విధానంలో రెండుపేపర్లుగా పరీక్ష ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (మ్యాట్), స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(సాట్).. ఇలా రెండు పేపర్లు కలిపి 180 ప్రశ్నలకు 180 మార్కులుంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు. మ్యాట్ పేపర్‌లో మూడు విభాగాల నుంచి 90 ప్రశ్నలుఅడుగుతారు. మెంటల్ ఎబిలిటీ-45 ప్రశ్నలు, ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ-20 ప్రశ్నలు, హిందీ ప్రొఫిషియన్సీ నుంచి 25 చొప్పున ప్రశ్నలు ఇస్తారు. సాట్ పేపర్‌లో కూడా మూడు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 90 ప్రశ్నలుంటాయి. ఇందులో సైన్స్- 35, సోషల్ స్టడీస్-35, మ్యాథమెటిక్స్ విభాగం నుంచి 20 చొప్పున ప్రశ్నలు అడుగుతారు.

దరఖాస్తులు ప్రారంభం..

దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 10 నుంచి ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డ్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి. ప్రింటవుట్లను, ధ్రువీకరణ పత్రాలను డీఈవోలకు పంపించాలి. సెప్టెంబర్ 15 తుది గడువుగా నిర్ధారించారు. ప్రింటెడ్ పత్రాలను సెప్టెంబర్ 19న డీఈఓ కార్యాలయంలో సమర్పించాలి. డిసెంబర్ 3న పరీక్ష ఉంటుంది. ప్రతి విద్యార్థి పరీక్ష ఫీజు కింద రూ.100 ఎస్‌బీఐ చలానా రూపంలో సంబంధిత ధ్రువపత్రాలతో పాటు జతచేయాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లిస్తే సరిపోతుంది.హెచ్‌టీటీపీ://బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ప్రణాళికాబద్ధంగా చదవాలి..



ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభా పరీక్షకు పట్టుదలతో చదివితే సులభంగా అర్హత సాధించవచ్చు. గణితం, ఇంగ్లీషులో పట్టు ఉంటే చాలు. ప్రామాణికంగా చదివితే నెలరోజుల్లో మంచి స్కోరింగ్ చేయవచ్చు. నాలుగేళ్ల పాటు ఆర్థిక చేయూత ఉంటుంది. మంచి ఫలితాలు సాధించవచ్చు. మంచి పుస్తకాలు కొనుగోలు చేసుకోవచ్చు.

– నప్పటి శివరాంప్రసాద్, ఎంఈఓ-1, కంచిలి

ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయ మేనేజర్ పరారీ

- నరసన్నపేట కార్యాలయం వద్ద ఖాతాదారుల ఆందోళన



ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయంలో ఖాతాదారుల ఆందోళన

నరసన్నపేట: స్థానిక కొత్తబస్టాండ్ ఎదురుగా జయలక్ష్మి షాపింగ్ కాంప్లెక్స్ పై అంతస్తులో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయం మేనేజర్ టి.యుగంధర్‌రాజు పరారైనట్లు సమాచారం. ఖాతాదారులకు చెందిన రూ. 40 లక్షలు పట్టుకొని ఆయన వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. గడిచిన 15 రోజులుగా ఆయన ఆచూకీ తెలియకపోవడం, ఖాతాదారులకు కార్యాలయ సిబ్బంది సక్రమంగా సమాధానాలు ఇవ్వకపోవంతో నాలుగు రోజులుగా కార్యాలయం వద్ద రాద్ధాంతం జరుగుతోంది. గురువారం ఇది మరింత తీవ్ర స్థాయికి చేరింది. మేనేజర్ నుంచి మోసపోయిన ఖాతాదారులు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తాము పద్దు పెట్టిన బంగారం రుణంలో కొద్ది మొత్తాలను మేనేజర్‌కు చెల్లించామని, ఆయన చేతి రశీదులు ఇచ్చారని వారు చెబుతున్నారు. సుమారు రూ. 40 లక్షల వరకూ పలువురి ఖాతాదారుల నుంచి డబ్బు వసూలు చేసి మేనేజర్ పరారైపోయారు. మరోవైపు మేనేజర్ యుగంధరరావు ముత్తూట్ ఫైనాన్స్‌పై అధికారులకు ఓ లేఖ రాశారు. నరసన్నపేట కార్యాలయం నుంచి తన సొంత అవసరాలకు రూ.12,72,450 వాడుకున్నానని, దీనికి తానే బాధ్యత వహిస్తానని చెప్పినట్లు సమాచారం. బ్యాంకు మేనేజర్ వ్యవహారంపై పూర్తిగా దర్యాప్తు చేయాలని, తమకు న్యాయం చేయాలని ఖాతాదారులు కోరుతున్నారు. లబ్బ హేమ అనే బాధితురాలు మాట్లాడుతూ మేనేజర్ ఫోన్‌పేకు రూ.50వేలు వేశానని, ఇప్పుడు సిబ్బంది తమకు తెలీదని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అబ్బాయిపేటకు చెందిన చిన కూర్మారావు మాట్లాడుతూ పది తులాల బంగారం కుదవ పెట్టి రూ.2.90 లక్షలు అప్పు తీసుకున్నానని, వడ్డీతో సహా రూ. 3. 60 లక్షలు అయ్యిందన్నారు. దీంట్లో రూ. 2 లక్షలను మే నెల 23న చెల్లించానని, దీనికిగాను మేనేజర్ ఇచ్చిన రశీదులు చెల్లవని ఇప్పుడు అంటున్నారని, మళ్లీ మొత్తం డబ్బు కట్టాలని అంటున్నారని, న్యాయం చేయాలని కోరారు.

చిన్ని కృష్ణుడి అవినీతి తృష్ణ

- మార్కెటింగ్ శాఖను కుదిపేసిన చిన్ని కృష్ణ
- ఆయన నిర్వాకంతో ఇప్పటికే ముగ్గురు సస్పెన్షన్
- తాజాగా జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కాళేశ్వరరావుపై సస్పెన్షన్ వేటు
- బాధ్యుల నుంచి ఇప్పటివరకు రూ. 6లక్షలకు పైగా రికవరీ
- నిబంధనలు కఠినతరం చేసిన కమిషనర్



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జిల్లాలోని ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం కమిటీల్లో జరిగిన అక్రమ వ్యవహారం ఏకంగా రాష్ట్ర మార్కెటింగ్ శాఖను కుదిపేసింది. అక్రమాలకు పాల్పడిన సెక్రటరీ చిన్నికృష్ణతో పాటు ప్రమేయం ఉన్న మరో ముగ్గుర్ని ఇప్పటికే సస్పెండ్ చేసిన మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు.. తాజాగా జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కాళేశ్వరరావును సైతం సస్పెండ్ చేశారు. పర్యవేక్షణ చేయలేదనే నెపంతో ఆయనపై వేటు వేశారు. ఇన్‌చార్జిగా ప్రస్తుత సీనియర్ మార్కెటింగ్ అసిస్టెంట్ గంగాధర్‌ను నియమించారు. ఇప్పటికే సస్పెన్షన్‌కు గురైన చిన్నికృష్ణ స్థానంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీకి ఆమదాలవలస సెక్రటరీ సతీష్‌ను, ఇచ్ఛాపురం మార్కెట్ కమిటీకి కంచిలి సెక్రటరీ తాతారావును ఇన్‌చార్జిలుగా నియమించారు.

కేసులు నమోదు

ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీల్లో సెక్రటరీగా పనిచేసిన చిన్నికృష్ణ దాదాపు రూ. 3కోట్ల 22లక్షల 75వేల 819మేర నిధులు పక్కదారి పట్టించారు. దాదాపు 10 బ్యాంకు ఖాతాలకు ఈ నిధులను దారి మళ్లించారు. ఇందులో తన కార్యాలయంలో పని చేసిన మరో ముగ్గుర్ని భాగస్వామ్యం చేసి ఇరికించారు. దీంతో చిన్నికృష్ణతో పాటు కె.రామారావు, కె.మురళీకృష్ణ, ఉమామహేశ్వరరావులను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే, అక్రమాలకు పాల్పడిన వీరిపై పోలీసు స్టేషన్‌లకు ఫిర్యాదు చేసి, విచారణ జరిపించాలని మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే ఆదేశించారు. కానీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో కమిషనర్ సీరియస్ అయినట్టు సమాచారం. ఈ క్రమంలో యుద్ధ ప్రాతిపదికన ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం మార్కెట్ కమిటీలకు ఇన్‌చార్జి సెక్రటరీలుగా నియమించి, వారి చేత సంబంధిత పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేయించారు. ఇప్పుడా స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. విచారణ కూడా ప్రారంభమైంది.

ఎందుకు పరిశీలించలేదు..

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మార్కెట్ కమిటీల నిధుల దుర్వినియోగాన్ని ఆ శాఖ సీరియస్‌గా తీసుకుంది. ఇంత జరుగుతుంటే పరిశీలించకుండా నిర్లక్ష్యం వహించారనే కారణంతో జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కాళేశ్వరరావును సైతం తాజాగా కమిషనర్ సస్పెండ్ చేశారు. అంతేకాకుండా జిల్లాలో ఏం జరుగుతుందో తెలుసుకునే బాధ్యతను జాయింట్ డైరెక్టర్ సుధాకర్‌కు అప్పగించారు. ఇప్పుడా ఆయన జిల్లాలోనే ఉన్నారు. ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీల్లో తనిఖీలు కూడా చేయిస్తున్నారు.

ఇతర చోట్ల కూడా..

ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీల్లో జరిగిన అవినీతి బాగోతంతో అప్రమత్తమైన ఉన్నతాధికారులకు రాష్ట్రంలో మరికొన్ని చోట్ల అక్రమాలు కనిపించాయి. యుద్ధ ప్రాతిపదికన జరిపిన రికార్డుల తనిఖీలతో పలుచోట్ల అక్రమాలను గుర్తించారు. ఇక్కడ చిన్నికృష్ణ రూ. 3కోట్ల 22లక్షల 57వేల 819 మేర నిధులు పక్కదారి పట్టించగా, కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో గతంలో పనిచేసిన సూపర్‌వైజర్ బి.సురేష్‌బాబు సీఎంఎఫ్ కంట్రిబ్యూషన్ నిధుల నుంచి రూ.14,56,790 మేర తన వ్యక్తిగత ఖాతాలకు మళ్లించారు. నూజివీడు మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ ఖాజాబాబు రూ. 2లక్షల 42వేలు మేర మార్కెట్ కమిటీకి నిధులు జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్టు తేలింది. ఏలూరు ఏఎంసీలో ఎస్.కె.పర్వీనా బేగమ్ కూడా నిధులు దుర్వినియోగం చేయగా, గతంలో గోపాలపురం, నర్సాపురం, పెనుగొండ మార్కెట్ కమిటీల్లో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేసిన ఎ.రాజేష్‌కుమార్ హౌస్ బిల్డింగ్ అడ్వాన్సు నిధుల నుంచి రూ. 28లక్షల 23వేల 626 మేర నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేశారు. కందుకూరు స్పెషల్ గ్రేడ్ సెక్రటరీగా పనిచేసిన కె.నూర్ మహ్మద్ దాదాపు రూ. 22లక్షల 82వేల 472మేర నిధులు దుర్వినియోగం చేశారు. లక్కిరెడ్డిపాలెం ఏఎంసీలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేసిన వి.సుబ్బ నర్సింహులు దాదాపు రూ. 12లక్షల 7వేల వరకు స్టాఫ్ ప్రావిడెంట్ నిధులను దుర్వినియోగం చేశారు.

నిబంధనలు కఠినతరం

రాష్ట్రంలో పలుచోట్ల నిధుల దుర్వినియోగం వెలుగు చూడటంతో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు నిబంధనలు కఠినతరం చేశారు. యుద్ధ ప్రాతిపదిక అన్ని మార్కెట్ కమిటీల సేవింగ్స్, కరెంట్ ఖాతాలను తనిఖీ చేయాలని, ఇకపై సెక్రటరీ, అసిస్టెంట్ డైరెక్టర్ జాయింట్ ఖాతాగా నిధులు వినియోగం చేపట్టాలని, మార్కెట్ కమిటీల్లో చేసే ప్రతి ఖర్చుకు, ఆదాయానికి అసిస్టెంట్ డైరెక్టర్ కౌంటర్ సంతకం ఉండాలని మార్కెట్ కమిటీలకు ఆదేశాలిచ్చారు. అంతేకాకుండా స్థానికంగా ఉన్న ఉద్యోగులు లేదంటే పక్కనున్న మార్కెట్ కమిటీల ఉద్యోగులను ఇన్‌చార్జులుగా నియమించాలే తప్ప సుదూర ప్రాంతాలకు చెందిన వారిని నియమించకూడదని, ఆ దిశగా ఖాళీగా పోస్టులను భర్తీ చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని మార్కెటింగ్ శాఖ కమిషనర్ లిఖితపూర్వకంగా ఆదేశించారు. అలాగే, మార్కెట్ కమిటీల వారీగా రికార్డులు, బ్యాంకు ఖాతాలను షెడ్యూల్ ప్రకారంగా తనిఖీ చేయాలని అన్ని మార్కెట్ కమిటీలకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

రూ.6 లక్షలకుపైగా రికవరీ

నిధుల దారి మళ్లింపుపై కేసు నమోదు చేయడమే తరువాయి సస్పెండైన సిబ్బంది నుంచి రికవరీ ప్రారంభమైంది. ఒక ఉద్యోగి నుంచి రూ. 6లక్షల 22వేల వరకు రికవరీ కూడా చేశారు. మిగతా మొత్తమంతా చిన్నికృష్ణ కు సంబంధించిన ఖాతాల్లోనే ఉన్నట్టు గుర్తించారు. దాదాపు 10ఖాతాలకు ఆ నిధులు వెళ్లడంతో వాటి నుంచి రికవరీ చేసే పనిలో నిమగ్నమయ్యారు.



చేనేతను ప్రోత్సహిద్దాం: కలెక్టర్



చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం అర్బన్: చేనేత కార్మికులు తయారు చేసే వస్త్రాలు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని వైఎస్సార్ కూడలి వద్దనున్న డాక్టర్ వైఎస్సార్ మున్సిపల్ కల్యాణ మండపంలో గురువారం చేనేత వస్త్ర ప్రదర్శన, విక్రయాలను ఆయన ప్రారంభించారు. జిల్లా చేనేత వస్త్రాలకు మంచి పేరుందని, ముందుగా జిల్లా ప్రజలే చేనేత కార్మికులను ప్రోత్సహించాలన్నారు. జిల్లా అధికారులు ప్రతి సోమవారం చేనేత వస్త్రాలను ధరించి స్పందనకు హాజరు కావాలని సూచించారు. జిల్లాలోని 4 క్లస్టర్స్‌కు రూ.4 కోట్లు మంజూరు చేశామని, రాష్ట్రంలో చేనేత వస్త్ర ప్రదర్శన ఏ ప్రాంతంలో ఏర్పాటు చేసినా జిల్లా నుంచి చేనేత కార్మికులను తీసుకువెళ్తున్నామని చెప్పారు. చేనేత కార్మికులకు రుణాలు కావాలంటే సంబంధిత అధికారుల ద్వారా బ్యాంకు రుణాలు పొందవచ్చన్నారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 20 స్టాల్స్ ద్వారా వస్త్ర ప్రదర్శనతో పాటు విక్రయాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఐ.ధర్మారావు మాట్లాడుతూ పేరొందిన పొందూరు, అంపోలు, కొరసవాడ, అక్కులపేట, తోలాపి, అలికాం, సింగుపురం, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన పొందూరు ఖద్దరు, జమదానీ కాటన్ చీరలు, కాటన్, సిల్క్, సాదా చీరలు, మంగళగిరి, డ్రస్ మెటీరియల్స్, కలంకారీ వస్త్రాలు, తువ్వాళ్లు, లుంగీలు, పొందూరు షర్టింగ్, పంచెలు, ఇతర చేనేత వస్త్రాలను అందుబాటులో ఉంచామన్నారు. తక్కువ ధరకే లభించే వస్త్రాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, డిపిఆర్‌ఓ కె. బాలమాన్ సింగ్, డెవలప్‌మెంట్ అధికారులు ఆర్. శేఖర్, యస్. శ్రీను, ఎండిఓ ఇ. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లపై వివక్ష వద్దు



ట్రాన్స్‌జెండర్లకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ట్రాన్స్‌జెండర్లపై వివక్ష చూపడం సరికాదని, వీరంతా ప్రభుత్వం అందించే పథకాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఆయన గురువారం న్యాయ సేవా సదన్‌లో ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వం అందించే పథకాలపై సమావేశం నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం ఓ ప్రభుత్వ శాఖ కూడా ఉందని, వారికి ఏదైనా అన్యాయం జరిగితే జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని చెప్పారు. అవసరమైన వారు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కూడా తీసుకోవచ్చని, అందుకు కావాల్సిన సాయం దివ్యాంగుల శాఖ అందిస్తుందని తెలిపారు. అర్హులకు ఇల్లు, ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి మెరుగైన వైద్యసేవలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్లకు ధ్రువీకరణ పత్రాలు, గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగులు, వృద్ధులు ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ ఏడీ కె.కవిత, మెప్మా పీడీ కిరణ్ కుమార్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనురాధ, హౌసింగ్ పీడీ గణపతి, బీసీ వెల్ఫేర్ ఎస్సీ వెల్ఫేర్ కార్పొరేషన్ అధికారులు, బెజ్జిపురం యూత్ క్లబ్ ఎన్జీవో ప్రసాదరావు, పెద్ద సంఖ్యలో పోలీసులు డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రమణ తదితరులు న్యాయవాది ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.

పెద్దపులి సంచారమంటూ ప్రచారం



పెద్దపులి పాద ముద్రలు

ఎల్ఎన్ పేట: మండలంలోని జంబాడ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం చేస్తోందని ప్రచారం జరుగుతోంది. బుధవారం రాత్రి సరుబుజ్జిలి అటవీ శాఖ సెక్షన్ పరిధిలోని అమృతలింగానగరం నుంచి జంబాడ మీదుగా కడగండి వరకు ఉన్న ఫారెస్టు రోడ్డుకు ఎగువున ఉన్న అటవీ ప్రాంతానికి పెద్దపులి చేరుకుందని స్థానికులు చెబుతున్నారు. జంబాడ రోడ్డులో నిలుపుదల చేసిన గొర్రెల మంద నుంచి గొర్రెను ఎత్తుకెళ్లిందని సరుబుజ్జిలి మండలం గోనేపాడు గ్రామానికి చెందిన బాధిత గొర్రెల కాపరి అప్పారావు తెలిపారు. ఉదయం నిద్రలేచిన తర్వాత గొర్రెల మందకు కొస్త దూరంలో గొర్రె పడి ఉండటం చూశానని, ఏమైందో అని పరిశీలించగా పులి అడుగులు కనిపించాయని, దీంతో భయపడి అక్కడి నుంచి గొర్రెల మందను ఇంటికి తోలుకుని వెళ్లిపోయానని ఆయన చెప్పారు. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని పులి దాడి చేసిన గొర్రెను పరిశీలించారు. పులి పంజా దెబ్బలను గుర్తించి పులిదాడిగా నిర్ధారణ చేశారు. పులి అడుగుజాడలను గుర్తించారు. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. విజయనగరం, మన్యం జిల్లా పార్వతీపురం ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు గుర్తించామని, అందరినీ అప్రమత్తం చేస్తున్నామని శ్రీకాకుళం, పాతపట్నం అటవీశాఖ రేంజర్‌లు రాజశేఖర్, జగదీష్‌లు తెలిపారు.

యువకుడు బలవన్మరణం



వంశీ కృష్ణ మృతదేహం

నరసన్నపేట: స్థానిక కుమ్మరిపేట వీధిలో బుడుమూరుకు చెందిన గాడు వంశీ కృష్ణ (26) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన గత రెండేళ్లుగా భార్య భారతితో కలిసి కుమ్మరిపేటలో ఇళ్లు అద్దెకు తీసుకొని జీవిస్తున్నాడు. ఆయన భార్య భారతి స్థానిక ఎస్ఆర్ షాపింగ్‌మాల్‌లో పనిచేస్తున్నారు. వంశీ కృష్ణ లగేజీ వాహనం నడుపుతున్నాడు. బుధవారం ఎప్పటిలా భారతి షాపింగ్ మాల్ నుంచి రాత్రి 9 గంటల సమయంలో ఇంటికి వచ్చే సరికి ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి పోసుకొని వంశీకృష్ణ కనిపించారు. వెంటనే 108 ఫోన్ చేసి వంశీకృష్ణను కాపాడేందుకు భార్య చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు 108 సిబ్బంది తెలిపారు. వెంటనే నరసన్నపేట పోలీసులకు భార్య ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ అనంతరావు గురువారం కేసు నమోదు చేశారు. అప్పుల ఒత్తిడి కారణంగానే వంశీ ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెక్కలిలో..



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన జయబాబు

టెక్కలి రూరల్: స్థానిక నవీన్ నగర్ సమీపంలో డిపార్ట్‌మెంటల్ స్టోర్ నడుపుతున్న బెందాళం జయబాబు(35) గురువారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. సోంపేట మండలం పలాసపురం గ్రామానికి చెందిన బెందాళం జయబాబు టెక్కలి నవీన్ నగర్ సమీపంలో డిపార్ట్‌మెంటల్ స్టోర్ నడుపుకుంటూ భార్య ఆశ, ఇద్దరు పిల్లలతో కలసి జీవిస్తున్నారు. అయితే గురువారం రాత్రి భార్యకు చెప్పి షాపు నుంచి ఇంటికి వెళ్లాడు. ఎంత సేపైనా తిరిగి రాకపోవడంతో భార్య వెళ్లి చూసేసరికి ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో ఆమె చుట్టుపక్కల వారికి విషయం చెప్పింది. స్థానికుల సహాయంతో జయబాబును ఉరి నుంచి కిందకు దించి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించేలోపే ఆయన మృతి చెందాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగానే ఆయన ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఈ ఘటనపై టెక్కలి ఎఎస్‌ఐ నర్సింహులు ప్రాథమికంగా వివరాలు సేకరించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చెయ్యనున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన



బాల్య వివాహలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రణస్థలం: విద్యార్థులు సత్వర సమాచారం అందించి బాల్య వివాహ రహిత సమాజానికి తమవంతు సహాయం చేయాలని కోష్ట గ్రామ సచివాలయ మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజి కోరారు. పల్లెపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు వివరించారు. బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించి మానవహారం ఏర్పాటు చేశారు. బాల్య వివాహ రహిత సమాజానికి కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చంద్రయాన్-3 విజయం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, బ్రెడ్స్ సంస్థ సభ్యురాలు ఎల్.తేజశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.